www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 21 ఆగస్టు 2023

5

చిత్తూరు

శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో

డిసిసిపి కోర్సులో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి- క్యాంపస్: టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీపద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ కోర్సులో ప్రవేశాలకు సెప్టెంబర్ మొదటి వారంలో స్పాట్ అడ్మిషన్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో చేరదలుచుకున్న విద్యార్థులు పాలిసెట్ కౌన్సిలింగ్ (2వ విడత)లో డిసిసిపి కోర్స్ ఆప్షన్‌ను, కాలేజీ కోడ్: ఎస్‌పిడబ్ల్యూటి ఆప్షన్‌గా ఎంచుకోవాలనానరు. ఈకోర్సులకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు మాత్రమే ఉంటుందని, విద్యార్థినులకు ఉచితంగా హాస్టల్ సదుపాయం ఉందని ఈఅవకాశాన్ని విద్యార్థినులు వినియోగించుకోవాల్సిందిగా కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నెం. 98487 97024, 62815 63804, 62810 94304 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

యుటిఎఫ్ మధ్యంతర కౌన్సిల్‌లో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి- పలమనేరు

నేడు ఉద్యోగ ఉపాధ్యాయులు అనుభవిస్తున్న సర్వహక్కులు ఉద్యమాల ద్వారానే సాధించబడ్డాయని, పాలకుల దయా దాక్షిణ్యాల మీద ఆధారపడి హక్కులు రాలేదని యుటిఎఫ్ చిత్తూరు జిల్లా మధ్యంతర కౌన్సిల్ మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. ఆదివారం చిత్తూరు జిల్లా యుటిఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశాలు పలమనేరులోని లయన్స్ క్లబ్ సమావేశ మందిరంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.సోమశేఖర్ నాయుడు అధ్యక్షతన జరిగాయి. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం హాజరై మాట్లాడారు. గతంలో సాధించుకున్న హక్కులను పాలకవర్గాలు కాలరాస్తున్నాయని, ప్రజాస్వామిక హక్కులు లేకుండా చేస్తున్నాయని, వీటిని కాపాడుకోవడానికి నిరంతరం ఉద్యమాలు చేయాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నిరంతరం సంబంధాలు కలిగి ఉండి ప్రభుత్వ విద్యారంగాన్ని, తద్వారా ప్రభుత్వ పాఠశాలలు రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయ హక్కులను సాధించడానికి గడచిన 50 సంవత్సరాలుగా యుటిఎఫ్ నిరంతర కృషి చేసిందని, ఉపాధ్యాయుల హక్కులు కాపాడడానికి ఎంతో మంది నాయకులు తమ జీవితాలను త్యాగం చేశారని తెలియజేశారు. నిర్బంధాలు, ఒత్తిడులు ఎదురైనా, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడటం కోసం ఉపాధ్యాయుల సంక్షేమాన్ని సాధించాడానికి నిరంతరం కృషి చేస్తుందని తెలియజేశారు. ప్రశ్నించేతత్వాన్ని విద్యార్థులకు బోధించాలని, ప్రజాతంత్ర హక్కుల్ని నేర్పాలని కోరారు. 117 జీవోని రద్దు చేయకుండా ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోలేమని 117 జీవోని రద్దు చేసే పోరాటంలో ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.రఘుపతిరెడ్డి మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తుంటే ఆ డిమాండ్‌ని పక్కనపెట్టి మరొక కొత్తని విధానాన్ని తీసుకువచ్చిందని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించకపోతే ఐక్య ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యవర్మ జివి.రమణ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. జిల్లా కార్యదర్శులు యుటిఎఫ్ భవిష్యత్తులో చేసే పోరాటాల మీద కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు మునిరత్నం, రెహానా బేగం, కోశాధికారి ప్రసన్న కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ సిపి.ప్రకాష్, జిల్లా కార్యదర్శులు కష్ణమూర్తి, ఏకాంబరం ఈశ్వర్ మహేంద్ర, మణిగండన్, రెడ్డెప్ప నాయుడు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు యుగంధర్, ప్రజాసంఘాల నాయకులు గంగరాజు, ఓబుల రాజు, గిరిధర్ గుప్తా, భువనేశ్వరి, మల్లారపు నాగార్జున, సబ్ కమిటీ కన్వీనర్లు సరిత, రమణ, దీనావతి, స్థానిక డివిజన్ నాయకులు వేమ చంద్రారెడ్డి, శశికుమార్, పిసి బాబు, శివశంకర్, నిర్మల, గురునాథం, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, గురుమూర్తి శెట్టి, పాపయ్య, నాగభూషణం, పురుషోత్తం పాల్గొన్నారు.

28న నగరికి సిఎం రాక

పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు, కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి- నగరి: ఈనెల 28న నగరికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి రానున్నారని రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ, భూగర్భ, గనుల శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న విద్యా దీవెన పథకాన్ని బటన్ నొక్కి ప్రారంభించనున్నారని చెప్పారు. రాష్ట్ర ముఖ్య మంత్రి నగరి పర్యటనకు సంబంధించి బహిరంగ సభ, హెలిప్యాడ్స్ ఏర్పాట్లును మంత్రి పరిశీలించారు. నగరిలో జరగనున్న సీఎం పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 28న చిత్తూరు జిల్లా నగరి పర్యటనను విజయవంతంగా నిర్వహిదామని మంత్రి పేర్కొన్నారు. ఆదివారం నగరి మున్సిపల్ కార్యాలయం సమావేశం హాల్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. నారాయణ స్వామి, రాష్ట్ర సాంస్కతిక, పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కె.రోజా, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు ఎన్.రెడ్డెప్ప, జెడ్పి చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్, జిల్లా ఎస్పి వై.రిశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యేలు సత్యవేడు, పూతలపట్టు అదిమూలం, ఎంఎస్.బాబు, జేసి పి.శ్రీనివాసులు, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్‌లతో కలసి ముఖ్యమంత్రి పర్యటన ముందస్తు ఏర్పాట్లపై అన్నిశాఖల అధికారులతో సమన్వయ సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు కషితో చిత్తూరు జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటనలను రాష్ట్ర స్థాయిలోనే బాగా నిర్వహించడం జరిగిందని, ఈనెల 28న నగరి లో జగనన్న విద్యాదీవెన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్న సందర్భంగా అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతంగా నిర్వహించుటకు అధికారులు కషి చేయాలన్నారు. అంతకు ముందు నగరి పర్యటనలో ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభ, రోడ్డుషో, ముఖ్యమంత్రి అరైవల్, డిపార్చర్‌లకు సంబంధించి హెలిప్యాడ్స్ గ్రౌండ్స్, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు పనులను, మంత్రులు, జిల్లా కలెక్టర్, ఎస్పీతో కలసి పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఎలాంటి చిన్న పొరపాటు లేకుండా అధికారు జాగ్రత్తగా ఎవ్వరికీ కేటాయించిన పనులను వారు సకాలంలో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, డిఆర్డీఏ, మెప్మా పిడిలు, తులసి, రాధమ్మ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి, ఆర్‌డబ్ల్యూఎస్, ఎపిఎస్‌పిడిసిఎల్‌ఎస్‌ఈలు చంద్ర శేఖర్‌రెడ్డి, ఉమామహేశ్వర రావు, శంకర్ బాబు, కష్ణారెడ్డి, డీఈఓ విజయేంద్ర రావు, సమగ్రశిక్ష ఏపి సి.వెంకట రమణారెడ్డి, ఆర్‌టిసి ఆర్‌ఎం. జితేంద్ర నాథ్‌రెడ్డి, డిటిసి నిరంజన్ రెడ్డి, డిపిఓ లక్ష్మీ, పౌరసరఫరాల శాఖ డిఎం.మోహన్ బాబు, డిఎల్‌డిఓ రవి కుమార్, నగరి, ఆర్డీఓలు సుజన, డ్వామా ఏపిడి ఉమాదేవి, నగరి మున్సిపల్ కమీషనర్ వెంకట్రామి రెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిడిఓ లీలా మాధవి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మైనర్ ప్రేమజంట ఆత్మహత్య

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: తిరుపతి జిల్లా భాకారాపేటలో దారుణం చోటుచేసుకుంది. ఓ మైనర్ ప్రేమ జంట చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం చిట్టెంవారిపల్లికి చెందిన కళ్యాణి (15), చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం జోగిఇండ్లు (కొత్తిండ్లు)కు చెందిన యుగంధర్ (17) పుంగనూరు ఎంసివి జూనియర్ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. వీరిద్దరూ గతకొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరి కులాలు వేరు కావడం, తాము మైనర్లు కావడంతో తమ ప్రేమని ఇంట్లో అంగీకరించరనే ఉద్దేశంతో ఈనెల 18వ తేదీ రాత్రి ఇంటి నుంచి ఇద్దరు పరారయ్యారు. అదే రోజు పెళ్లి చేసుకుని ఆదివారం చిన్నగొట్టికల్లు మండలం భాకరాపేట సమీపంలోని భాకరాపేట ఘాట్ అడవుల్లోకి వచ్చి ఇంటికి తిరిగి వెళ్లలేని పరిస్థితిలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. భాకరాపేట పోలీసులు సంఘటన స్థలం చేరుకొని ఇద్దరు మతదేహాలని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. భాకరాపేట ఇన్‌చార్జి సిఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా సాధికారిత ఆర్థిక ఎదుగుదలకు సాయం

ఇంటర్వ్యూ

డిఆర్‌డిఎ పీడీ తులసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మహిళా సాధికారితే లక్ష్యంగా జిల్లాలో ఆర్థిక సంవత్సరంలో 1,843 ఎస్‌హెచ్‌జిలకు రూ.122కోట్లు బ్యాంకు లింకేజి రుణాలు, స్త్రీనిధి కింద ఈఏడాది ఇప్పటి వరకు 11,492 సంఘాలకు రూ.74కోట్లు రుణసౌకర్యం కల్పించామని డిఆర్‌డిఎ పీడీ తులసి ప్రజాశక్తితో మాట్లాడుతూ తెలిపారు. వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 2,59,946 మంది వివిధ రకాల ఫించన్‌దారులకు రూ.353కోట్లు పంపిణీ చేశామన్నారు. వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా 45 నుండి 60 మధ్య వయస్సు గల పేద ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ మహిళలకు ప్రతిఏటా రూ.18,750 చొప్పున వరుసగా నాలుగేళ్ల పాటు ఆర్థిక సాయం అందిస్తున్నామని అన్నారు. ఈఏడాది మూడువ విడతగా 1,00,685 మంది లబ్దిదారులకు రూ.189 కోట్లు వారి వ్యక్తిగత ఖాతాలకు నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. ఇలా మహిళా సాధికారిత ఆర్థిక చేయూతను అందించేలా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పని చేస్తోందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ తులసి తెలిపారు. జిల్లాలో గ్రామీణాభివృద్ధి సంస్థ అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పథకాలను తెలియజేశారు.

డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ తులసి

ప్రజాశక్తి : వైఎస్ఆర్ ఆసరా పథకం ప్రయోజనం ఏమిటి?

డిఆర్‌డిఎ పిడి: వైఎస్ఆర్ ఆసరా పథకం కింద ఎస్‌హెచ్‌జిలకు రుణమాఫీ కల్పించుటకు వారి ఖాతాలో నిల్వ ఉన్న రుణాలను నాలుగు దఫాలుగా పొదుపు ఖాతాలకు జమచేయడం జరుగుతోంది.

ప్రజాశక్తి: జగన్న తోడు ఈ పథకం ద్వారా చిరువ్యాపారులకు ఎలాంటి సాయం అందుతోంది?

డిఆర్‌డిఎ పిడి: జగన్నతోడు పథకాన్ని రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చిన్నచిన్న వ్యాపారులు చేసుకొనే చిరువ్యాపారులకు ఆర్థిక సాయం అందిచేలా రూపకల్పన చేయడం జరిగింది. ఏడాదికి రూ.10వేలు సున్నా వడ్డీకి అందిస్తు ఆర్థిక చేయూతను అందిచడం జరుగుతోంది.

ప్రజాశక్తి: వైఎస్ఆర్ సున్నా వడ్డీ ఎంత మందికి అందించారు..?

డిఆర్‌డిఎ పిడి: జిల్లాలో నాలుగో విడతలో చిత్తూరు జిల్లాలో 28,705 మంది స్వయం సహాయ సంఘాలకు 37,68,15 మంది సభ్యులకు రూ.40.05కోట్లు సున్నావడ్డీ కింద స్వయం సహాయక సంఘాల మహిళల వ్యక్తిగత ఖాతాల్లో జమకానున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో సకాలంలో వాయిదా చెల్లించిన అన్ని సంఘాలకు సున్నా వడ్డీ వర్తిస్తుంది. క్యాష్ క్రెడిట్ లిమిట్ ద్వారా అప్పు పొందిన సంఘాలు ప్రతి నెలా గత నెలాఖరు నాటికి ఉన్న అప్పు నిల్వలో కనీసం 3శాతం ప్రస్తుత నెలలో చెల్లించి ఉండాలి. వైఎస్ఆర్ సున్నా వడ్డీ ప్రతినెలా ధృవీకరించి లెక్కించడం జరుగుతుంది.

ప్రజాశక్తి: వైఎస్ఆర్ భీమా ఎంత మంది చెల్లిస్తున్నారు....?

డిఆర్‌డిఎ పిడి: వైఎస్ఆర్ బీమా ద్వారా ఇప్పటి వరకు 984 మందికి క్లెయిమ్ రిజిస్టేర్ చేసి సాధారణ క్లెయిమ్ కింద 363 మందికి ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించడం జరిగింది. యాక్సిడెంట్ క్లెయిమ్ కింద 73 మందికి ఇన్యూరెన్స్ డబ్బులు చెల్లించడం జరిగింది.

రామకృష్ణాపురంలో అగ్రవర్ణాల కులాహంకారం

దళితులను ఆలయంలోకి రాకుండా తాళం
బయటే పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్న ఎస్సీలు
అధికారుల చర్యలు అంతంతమాత్రం

ప్రజాశక్తి- పుత్తూరుటౌన్

తిరుపతి జిల్లా పుత్తూరు మండలం రామకృష్ణాపురం గ్రామంలోని దళిత కుటుంబాలు నేటికీ వివక్షతకు గురవుతూనే ఉన్నారు. గ్రామంలోని జరుగుతున్న పోలాక్షమ్మ అమ్మవారి ఉత్సవాలల్లో దళితుల ప్రవేశం లేకుండా కులాహంకారంలో అదే గ్రామంలోని అగ్రవర్ణాలకు చెందిన వారు అడ్డుకుంటున్నారు. ఉత్సవాలలో ఆలయంలోకి ప్రవేశం లేకుండా తరచూ వివక్ష చూపుతున్నారు. శనివారం దళిత కుటుంబాల వారు ఆలయంలో అమ్మవారికి పొంగళ్లు పెట్టేందుకు ఆలయానికి చేరుకోగానే అగ్రవర్ణాలకు చెందిన వారితోపాటు ఆలయ పూజారి సైతం ఆలయానికి తాళాలు వేసి వెళ్లిపోయారు. దళితులకు ఆలయ ప్రవేశం కల్పించాలని ఆలయం వద్దనే నిరసనకు దిగారు. గత మూడు నెలలుగా దళితహక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశులు ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నా.. అగ్రవర్ణాల కులాహంకారంతో దళితులను ఆలయ ప్రవేశం చేయకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. ఆదివారం పోలక్షమ్మ అమ్మవారిని చుట్టుపక్కల ఏడు గ్రామాల్లో ఊరేగింపు అనంతరం రామకష్ణాపురం దళితవాడకు రావాల్సి ఉండగా కులవివక్షతో రాకుండా ఆలయ కమిటీ చైర్మన్ అడ్డుకోవడం దారుణమని వాపోయారు. గ్రామానికి పూర్వకాలం నుంచి వస్తున్న గ్రామదేవత ఊరేగింపు ఆదివారం రాకపోయేసరికి గ్రామస్తులు ఏం కీడు జరుగుతుందోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని పెద్ద ఎత్తున చేస్తామని గ్రామస్థులు తెలిపారు. అనంతరం తహశీల్దారు పరమేశ్వరస్వామి, పుత్తూరు ఎస్సై వెంకట మోహన్‌లకు వినతిపత్రాలు అందించారు. మండల కేంద్రం పుత్తూరులోని అంబేద్కర్ విగ్రహానికి దళిత సంఘాల నాయకులు, గ్రామస్తులు పూలమాలలు వేసి నిరసన తెలిపారు. అక్కడి నుంచి ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో దళిత, గిరిజన జిల్లా అధ్యక్షులు వై నందయ్య, గోపి, బాబి, సాయికిరణ్, సత్యవేడు నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ ఇన్‌ఛార్జి ధన, గ్రామస్తులు గజపతి, మనోహర్, భాస్కర్, చక్రపాణి, మునెయ్య, హరికష్ణ, దేశమ్మ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న దళిత సంఘ నాయకులు

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో

మెడికల్ క్యాంపు

మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్, డాక్టర్ మోహన్ డయబెటిక్ సెంటర్ సంయుక్తంగా ఆదివారం జైహింద్ నగరపాలక పాఠశాలలో, చిత్తూరులో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఎపిటిఎఫ్ చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్షులు గోపినాథ్, డాక్టర్ మోహన్ డియోబెటిక్ సెంటర్ చిత్తూరు బ్రాంచ్ డాక్టర్ చైతన్య వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఉచితంగా బీపీ, షుగర్, కొవ్వు, తదితర పరీక్షలు జరిపి తగిన సూచనలు ఇచ్చారు, ఒత్తిడి లేని జీవితం, శరీర వ్యాయామం, పౌష్టికాహారం వలన షుగర్, బీపీ నుంచి శరీరాన్ని రక్షించుకోవచ్చు అనీ, ఆరోగ్యంగా ఉండడానికి వ్యాయామాన్ని తప్పనిసరిగా పాటించాలని డాక్టర్ కోరారు ఈకార్యక్రమంలో ప్రధానకార్యదర్శి ముక్తార్ అహ్మద్, సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం, జగదీశ్, మధు, అఫ్జల్, వేణు, లక్ష్మీపతి, క్రిష్ణమూర్తి, రాజశేఖర్ పట్టణంలోని ఉపాధ్యాయులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నిత్య హోమశాల నిర్మాణానికి శంఖుస్థాపన

ప్రజాశక్తి- క్యాంపస్: శ్రీవేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రతిరోజు సంధ్యావందనం, అగ్ని కార్యం (హోమం) చేసుకోవడానికి వీలుగా నిత్య హోమశాల నిర్మాణానికి జేఈవో సదా భార్గవి ఆదివారం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జేఈవో సదా భార్గవి మాట్లాడుతూ విద్యార్థులు నిత్య హోమం చేయడం కోసం రూ.91లక్షలతో అగ్నిశాల నిర్మాణానికి టీటీడీ అనుమతించిందని తెలిపారు. అనంతరం జేఈవో విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య రాణి సదాశివమూర్తితో కలసి విద్యార్థుల వసతి సముదాయం వద్ద పనులకు శంఖుస్థాపన చేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఏవి రాధేశ్యామ్, ఈఈ మల్లిఖార్జున ప్రసాద్, డీన్ గోలి సుబ్రహ్మణ్యశర్మ, సంయోజకులు సత్యనారాయణాచార్యులు అధ్యాపకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఈనెల 23న బుధవారం స్థానిక పివికెఎన్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. జాబ్‌మేళాకు సంబంధించి గోడప్రతులను ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందులో అమర రాజా గ్రూప్, అపోలో ఫార్మసీ, డిక్సన్ టెక్నాలజీస్, ఫ్లిప్‌కార్ట్, చాతుర్య స్కిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, కోజెంట్ ఈ సర్వీసెస్, పేటీయం, ఫింకేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు, బ్లూస్టార్ క్లయిమేటిక్ లిమిటెడ్, హెచ్‌డిబి ఫైనాన్సియల్ సర్వీసెస్, మహీంద్రా హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, ట్రాన్స్ హోమ్ ఇండియా సర్వీసెస్, ముతూట్ ఫైనాన్స్ లిమిటెడ్, అగిల్ ఎయిర్పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్, ఫ్లస్ ఎస్ ఇన్స్ట్రుమెంట్స్, భారత్ ఫైనాన్సియల్ ఇంక్లూషన్ లిమిటెడ్, టిసిఎల్ కంపెనీల వారు మెగా జాబ్ మేళా లో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. కనీస విద్యార్హత పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ ఫెయిల్, పాస్ అయిన 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన స్త్రీ మరియు పురుష అభ్యర్థులు హాజరు కావచ్చునని తెలిపారు. ఈ జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి ఎన్.గుణశేఖర్, జిల్లా ఉద్యోగ ఉపాధి అధికారి పద్మజ తదితరులు పాల్గొన్నారు. 78931 10120, 63009 54441, 95056 01887 ఫోన్‌నంబర్లు సంప్రదించాల్సిందిగా తెలిపారు.

గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

మంత్రి ఇలాఖాలో దళితులకు ఆలయ ప్రవేశం లేదు

టిడిపి అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సప్తగిరి ప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సాక్షాత్తు మంత్రి రోజా సొంత నియోజకవర్గంలో దళితులను ఆలయంలోకి ప్రవేశించనియ్యకపోవడం హేయమైన చర్య అని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సాక్షాత్తు మంత్రి రోజా సొంత నియోజకవర్గంలోని పుత్తూరు రూరల్ మండలం, గొల్లపల్లి గ్రామంలో, పాలక్షమ్మ దేవాలయానికి దళితులను రానీకుండా అగ్రవర్ణాల అడ్డుకోవడం సభ్యసమాజం సిగ్గుతో తలదించుకోవాల్సి ఘటన అన్నారు. స్వతంత్రం వచ్చి 77 సంవత్సరాల అయినప్పటికీ ఇదే పరిస్థితి అన్నారు. మొన్ననే స్వతంత్ర వేడుకల్ని రంగరంగ వైభవంగా చేసుకున్న 3రోజులు తిరక్క ముందే సాక్షాత్తు పుత్తూరులో, ఒక మంత్రి రోజా ప్రాతినిధ్యం వహిస్తున్న తన సొంత నియోజకవర్గంలో, దళితులకు ఆలయ ప్రవేశం లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఒకపక్క దళితులకు నేను మేనమామ, అని ముఖ్యమంత్రి పెద్దపెద్ద డైలాగులు చెప్పటం కులం చూడం మతం చూడం ప్రాంతం చూడమని ఉపన్యాసాలు దంచడం ,మరోపక్క పుత్తూరు పట్టణంలో పాలాక్షమ్మ దేవాలయంలో దళితులకి ప్రవేశం లేకపోవడం, దళితుల్ని ఆలయానికి రానీయకుండా అడ్డుకోవడం అనాగరిక చర్యగా అభివర్ణించారు. సమావేశంలో టిడిపి, జిల్లా క్రిస్టియన్ అధ్యక్షులు మేషక్, టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గం అధ్యక్షుడు ప్రభుతేజ, తవణంపల్లి టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు పత్రపల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఏనుగు మృతి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి :

మండలంలోని నెల్లిపట్ల పంచాయతీ నల్లగుట్లపల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో విద్యుదాఘాతంతో ఏనుగు మతిచెందిన ఘటన చోటు చేసుకుంది. అటవీ ప్రాంతానికి సమీపంలోని అయ్యప్పనాయుడు అనే రైతు పొలంలోని విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో కరెంట్ షాక్ తగిలి శనివారం రాత్రి ఓ ఏనుగు మరణించింది. అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లిపట్ల గ్రామం అటవీ ప్రాంతంలోని వ్యవసాయపొలాల వద్దకు తరచూ ఏనుగులు గుంపులుగా వచ్చి పంటలపై దాడి చేస్తుంటాయి. శనివారం రాత్రి ఏనుగులు గుంపు పంటపొలాలలో సంచరిస్తుండగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో కరెంట్ షాక్‌కు గురై ఏనుగు అక్కడికక్కడే మతి చెందింది. అటవీ శాఖ అధికారులు ఆదివారం ఉదయం సంఘటన స్థలాన్ని సందర్శించి ఏనుగుకు శవపరీక్ష చేసి అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. ఇకనైనా అధికారులు స్పందించి ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతాల్లో తగుచర్యలు తీసుకోవాలని రైతులు, చుట్టుపక్కల గ్రామస్తులు కోరుతున్నారు.

కరెంట్‌షాక్‌తో మరణించిన ఏనుగు

నగర అభివృద్ధిపై సమావేశం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

స్థానిక పెన్షనర్ భవన్లో ఆదివారం చిత్తూరు స్మార్ట్‌సిటీ డెవలప్మెంట్ సొసైటీ అసోసియేషన్ సమావేశం జరిగింది. అధ్యక్షులు తాండవ మూర్తి, స్మార్ట్ సిటీ డెవలప్మెంట్ ప్రతినిధి సత్య, సభ్యులు పాల్గొన్నారు.. నగర సమస్యలపై ఐదుగురు చొప్పున ఒక్కొక్క బందంగా ఏర్పడి వివిధ రకాల ప్రజలు ఎదుర్కొంటున్న ఆసుపత్రి సేవలు ట్రాఫిక్ ఆక్రమణలు రైల్వే సమస్య తాగునీరు తదితర వాటికి ఒక కమిటీగా ఏర్పడి ఆ కమిటీలు ప్రజల సమస్యలు సేకరించి ప్రభుత్వ పాలకులు మరియు అధికారుల దష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని నిర్ణయించారు.

ఎన్జీఓ మహా సభలకు తరలిన ఉద్యోగులు

ప్రజాశక్తి-పలమనేరు: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 21, 22వ తేదీలలో నిర్వహించే ఏపీ ఎన్జీవో సంఘం 21వ రాష్ట్ర మహాసభలలో పాల్గొనడానికి పలమనేరు నుండి పెద్ద ఎత్తున ఉద్యోగులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్జీవో హోం వద్ద సంఘం తాలూకా అధ్యక్షుడు ఆనందబాబు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఏపీ ఎన్జీవో సంఘం దశాబ్దాల నుండి అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. నేడు జరగబోయే సభలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నందున ఉద్యోగుల ప్రధాన సమస్యలు అక్కడ పరిష్కారం అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి జయమ్మ, జిల్లా ఏపీ ఎన్జీవో సంఘం ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరి, జిల్లా అధ్యక్షుడు రమణ, ఎన్జీవో సంఘం కార్యవర్గ సభ్యులు మోహన్ రామ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులతో పాటు వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వీరికి మద్దతు తెలిపుతూ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు డివిజన్ పరిధిలోని ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికై సోమవారం ఆర్డీవో కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి గంగ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ఇచ్చిన మొబైల్ యాప్‌పై పనిభారం తగ్గించాలని, వారిపై రాజకీయ, అధికారుల వేధింపులు అరికట్టాలని, నాణ్యమైన ఫోన్ ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.10 లక్షలు కల్పించాలని తదితర డిమాండ్లతో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు చైతన్య, జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, గిరిధర్ గుప్తా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబుల రాజు, ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి లు తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు. కావున పలమనేరు డివిజన్ పరిధిలోని ఎనిమిది పీహెచ్‌సీ కేంద్రాల్లోని ఆశాలందరూ ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా గుణశేఖర్

ప్రజాశక్తి-వెదురుకుప్పం: వెదురుకుప్పం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా సోక్రటీస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ గుణశేఖర్‌ను ఎన్నుకున్నట్లు ఆదివారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పదవి రావడంతో సామాజిక బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. లయన్స్ క్లబ్ నూతన సెక్రటరీ గా నరసింహారెడ్డి, ట్రెజరర్ గా పురుషోత్తం రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గా యుగంధర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా దయాకర్ రెడ్డి, డైరెక్టర్లుగా కిరణ్ యాదవ్, వెంకటరమణారెడ్డి ఎన్నికైనట్లు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు సహకారంతో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం కుప్పం పీఈఎస్ హాస్పిటల్ డాక్టర్లతో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ఈ శిబిరంలో కంటి సమస్యలపై ఓపీకి 70 మంది హాజరు కాగా వారిని డాక్టర్లు పరిశీలించి 16 మందికి ఆపరేషన్ అవసరమని నిర్ధారించినట్లు తెలిపారు. ఆపరేషన్ అవసరమైనవారిని కుప్పం పీఈఎస్ హాస్పిటల్‌కి ఉచితంగా తీసుకెళ్లి కంటి ఆపరేషన్ చేయించి, తిరిగి ఇంటికి చేర్చేంతవరకు మహతి ఫౌండేషన్ ఛైర్మన్ సహకారంతో ఈ వైద్యం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరానికి వచ్చిన సిబ్బందికి, ప్రజలకు విందు భోజనం నిర్వహించారు. కార్యక్రమంలో మారుతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు, వారి బృందం పాల్గొన్నారు.

పద్మావతి మహిళా వర్సిటీలో ఫుడ్ ఫెస్ట్

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం, మైక్రోబయాలజీ, ఇండస్ట్రియల్ మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ విద్యార్థులు ఆహార భద్రత–నాణ్యత నిర్వహణ ఆధారంగా ఫుడ్ ఫెస్ట్‌ని నిర్వహించారు. ప్రోబయోటిక్స్ ప్రభావం, బ్యాక్టీరియా ప్రాముఖ్యత కలిగిన ఖండాంతర ఆహారాలుగా, ఆహారాల పులియబెట్టడం, ప్రాసెసింగ్‌లో ఈస్ట్, కొంబూచా, సాయర్‌క్రాఫ్ట్, మిల్లెట్ ఐటమ్స్, రాగి మాల్ట్ మరియు పులియబెట్టిన పాల ఉత్పత్తులు, చికెన్ ఊరగాయ, చీజ్ కేక్ ప్రదర్శనలో ఉంచారు. డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది కొనుగోలు చేశారు. కార్యక్రమంలో హెడ్ ప్రొఫెసర్ ఆర్.జయ మాధురి, ప్రొఫెసర్ పి.సువర్ణలతా దేవి, ప్రొఫెసర్ చండీ కుమారి, కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

సీతారాముల సేవలో పవిత్రారెడ్డి

ప్రజాశక్తి-తొట్టంబేడు: మండలంలోని కారాకొల్లు పంచాయతీ శ్రీకృష్ణపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీ సీతారాముల ఆలయ మహా కుంభాభిషేక కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గ్రామస్థులు పవిత్రారెడ్డిని ఘనంగా సన్మానించి స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో తొట్టంబేడు మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవ్ నాయుడు, సర్పంచ్ లత, చంద్ర, సురేష్, చిరంజీవి, కిషోర్, లక్ష్మి, వసంతమ్మ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీతోనే నగరి అభివృద్ధి

ప్రజాశక్తి-నగరి: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే నగరి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని, యువతకు మంచి భవిష్యత్తు వస్తుందని నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం నగరి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నగరి రూరల్ మండలం దామరపాకం పంచాయతీ, నంబాకం ఏడమ్మ్యు నుండి సుమారు 100 మంది వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ గాలి భాను ప్రకాష్ ఆ పార్టీ కండువాతో సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. దామరపాకం పంచాయతీ నుండి విజయకుమార్ కుమారుల ఆధ్వర్యంలో జి.సురేష్, పి.మణిగండన్, సూర్య గోవిందరాజులు, పరుశురాం, కొల్లాపురి, సురేష్, శంకర్ తదితర 100 మంది పార్టీలో చేరారు. అనంతరం గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ నగరిలో తెలుగుదేశం గెలిస్తేనే అభివృద్ధి, యువతకు ఉపాధి, ఉద్యోగాలు వస్తాయని నమ్మి పార్టీలో చేరిన ప్రతి ఒక్కరి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తూ, ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. అందరు కలిసి నగరిలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేసి రాష్ట్రంలో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన భవిష్యత్తుకు గ్యారంటీ పథకాలు ఎంతో బాగున్నాయని, మహిళలు, యువతకి ప్రాధాన్యత ఇవ్వడంతో పార్టీలోకి పలువురు స్వచ్ఛందంగా వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి ప్రెసిడెంట్ శివకుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, నియోజకవర్గ రైతు ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, టిఎన్‌టియుసి రాష్ట్ర సెక్రటరి బాలాజీ, ఏలుమలై రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్ గెలుపులో జీఎం రాజు కృషి

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలోని పి.బి వాడ పంచాయతీ 4వ వార్డులో తెలుగుదేశం అభ్యర్థి జి.మంజునాథ్ గెలుపునకు క్లస్టర్ ఇన్‌ఛార్జ్, మాజీ ఎంపీపీ జీఎం మునిరాజులు ఆ పంచాయతీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పని చేయడంతో 74 ఓట్ల మెజార్టీతో గెలుపొందడానికి దోహదం చేస్తూ సుమారు మూడు రోజులు నాలుగవ వార్డులో అహర్నిశలు పనిచేస్తూ టిడిపి అభ్యర్థి గెలుపే ధ్యేయంగా కృషి చేసి ఆ అభ్యర్థిని గెలిపించుకోవడం జరిగిందని ఆ పంచాయతీ ప్రజలు ఆదివారం పేర్కొన్నారు. అనంతరం మాజీ ఎంపీపీ జీఎం మునిరాజులు మాట్లాడుతూ పంచాయతీ ప్రజలు కొంతమంది మండల తెలుగుదేశం నాయకులు అభ్యర్థిని పెట్టడం వద్దని వారించినా, మొండిగా అధిష్ఠానంతో కొట్లాడి అభ్యర్థిని ప్రకటించి విజయం సాధించడం జరిగిందని పేర్కొన్నారు. తాను బలపరిచిన వ్యక్తి గెలుపొందడంతో ఆనందానికి అవధులు లేకుండా పోయాయన్నారు. గుడుపల్లి మండలం తెలుగుదేశం పార్టీకి గుండె లాంటి ఈ మండలంలో ఎలాంటి ఎన్నికలు నిర్వహించినా టిడిపి దే హవా అని దీమా వ్యక్తం చేశారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ

ప్రజాశక్తి-సోమల: జనావాస ప్రాంతాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో దోమలు వృద్ధి చెందకుండా నివారించవచ్చని సోమల వైద్యాధికారి జయసింహ అన్నారు. ఆదివారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన సోమల, మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామాలలో వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ దోమల నివారణలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, నీరు నిలువ లేకుండా చూడాలని, దోమతెరలు వాడాలని కోరారు. అనంతరం బస్టాండ్ కూడళ్లలో ర్యాలీలు నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం గంగాధరనెల్లూరు పురవీధుల్లో ఎఎన్ఎం, ఆశావర్కర్లు తో కలిసి సిహెచ్ఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను, చుట్టుపక్కల ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకొని దోమల ద్వారా వ్యాధులను ఒకరు నుంచి ఇతరులకు వ్యాప్తి చెందకుండా నివారించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎ మనోహర్, ఎఎన్ఎంలు జయమ్మ, పుష్పలత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నగరి: ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా నింద్ర మండల పిహెచ్‌సి వైద్యాధికారి, వారి సిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి కే.మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ప్రధాని జయంతి వేడుకలు

ప్రజాశక్తి-పుంగనూరు: భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 79వ జయంతి వేడుకల సందర్భంగా పట్టణంలోని స్థానిక ఇందిరా సర్కిల్లో జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు సబ్జాద్ భాష ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పేదలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ భారత ప్రధానిగా దేశంలోని పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు అని తెలిపారు. రాజీవ్ గాంధీ టెలికం, ఐటి, డిజిటల్ ఇండియా, శాస్త్ర సాంకేతిక రంగాలలో భారతదేశాన్ని అభివద్ధి చేశారు అని చెప్పారు. ఈ దేశంలోని యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన గొప్ప వ్యక్తి రాజీవ్ గాంధీ అని కొనియాడారు.

నగరి: నగరి మాజీ మున్సిపల్ ఛైర్మన్, ఏఐసీసీ మెంబర్ భానుమూర్తి ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఆదివారం నగరి బస్టాండు టవర్ క్లాక్ వద్ద రాజీవ్ చిత్రపటానికి పూలమాలవేసి అందరికీ స్వీట్లు పంచి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్లు నటరాజ మొదలియార్, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఆర్.బాబు, చిరంజీవి రెడ్డి, జిల్లా కార్యదర్శులు దేశయ్య, మున్సిపల్ పార్టీ ప్రెసిడెంట్ అల్లాపిచ్చి, దేశప్పన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భౌతికశాస్త్రంలో రెడ్డిబాబుకు డాక్టరేట్

ప్రజాశక్తి-క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగపు పరిశోధక విద్యార్థి పూజారి రెడ్డిబాబుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్టు పరీక్షల నియంత్రణాధికారి మూడే దామ్లు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య బి. దేవప్ర సాదరాజు పర్యవేక్షణలో " స్పెక్ట్రోస్కోపిక్ అండ్ ఎక్సైటెడ్ స్టేట్ డైనమిక్స్ ఆఫ్ అయాన్స్ డౌట్ ఆల్కలి మెటల్స్ బేస్డ్ పాస్ఫేట్స్ గ్లాసెస్ ఫర్ విజిబుల్ డివైస్ డిస్ప్లే అప్లికేషన్స్ " అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. రెడ్డిబాబు పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్ లలో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించినట్లు వెల్లడించారు. అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సులో పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించారు. రెడ్డిబాబుకు డాక్టరేట్ అవార్డు రావడంపై పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

అల్లత్తూరులో మహాశక్తి చైతన్య రథయాత్ర

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: అల్లత్తూరు గ్రామంలో టీడీపీ మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, ఉష ఆధ్వర్యంలో మహాశక్తి చైతన్య రథయాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించారు. రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని మహిళా శక్తి పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి హెలెన్, మాజీ ఎమ్మెల్యే హేమలత, బీఎన్ కండ్రిగ అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి కన్నయ్యనాయుడు, గ్రామ అధ్యక్షులు గురవయ్య, గోపి, సుబ్రమణ్యం, మనోహర్‌నాయుడు, మునెయ్య, మధు నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట షార్ ఆధ్వర్యంలో శ్రీ తులసి ఆయుర్వేదిక్ హాస్పిటల్ సహకారంతో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. కోట పోలూరు శివాలయం ఆవరణలో జరిగిన వైద్య శిబిరాన్ని ఒద్దె పూడి రాజగోపాల్ రెడ్డి ప్రారంభించారు. క్యాంపు ఛైర్మన్ రాధాకృష్ణ రావు, అధ్యక్షులు కామిరెడ్డి ఆదిశేషా రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు జెట్టి, ట్రెజరర్ అప్పారావు, కోగిలి జయరామిరెడ్డి చారిటబుల్ సొసైటీ వారి నేపథ్యంలో డాక్టర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

వేడుకగా మహాభారత ఉత్సవాలు

ప్రజాశక్తి-చంద్రగిరి: చంద్రగిరి నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి చంద్రగిరిలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలకు నాయకులు, కార్యకర్తలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్జున తపస్మాన్ ఘట్టంలో ఆమె పాల్గొని సారెను సమర్పించారు.

27న బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-పలమనేరు: రానున్న తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు పి తులసీనాథం నాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80 మందికి పైగా విద్యార్థులు 100కు పైగా పద్యాలు చెప్పడానికి పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. వీరందరికీ ప్రశంసాపత్రం, జ్ఞాపికతో పాటు పుస్తక బహుమతులు అందిస్తామన్నారు. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన పిల్లలకు పై బహుమతులతో పాటు నగదు అందించనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు.

కత్తెరపల్లి సర్పంచ్‌గా నవీన

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండలంలోని కత్తెరపల్లి సచివాలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ సి.నవీన, 4వ వార్డు సభ్యురాలు ఎం.రేఖా లతో ఎంపీడీవో మోహన మురళి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నవీన మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి పంచాయతీ అభివద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఎంపీపీ లతబాలాజీ మాట్లాడుతూ కత్తెరపల్లి పంచాయతీ ప్రజల ఆశీస్సులతో చిరంజీవి రెడ్డి భార్య నవీనను ఏకగ్రీవంగా అన్ని పార్టీల సభ్యుల సహకారంతో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని వివరించారు. అదేవిధంగా మాజీ తుడా ప్లానింగ్ అధికారి కె.కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కార్తీక్ రెడ్డి కృషి మేరకు ఇలా ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం జరిగిందని తెలిపారు. వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అనంతరం నూతనంగా ఎన్నుకున్న సర్పంచ్ నవీన ను గజమాలతో పట్టాభిరెడ్డి సత్కరించారు. అదేవిధంగా ఎంపీపీ లతబాలాజీ, సర్పంచులు గుణవతి లోకనాథం నాయుడు, ధనంజయ వర్మ, ధన శేఖర్ వర్మ, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి ధనుంజయ రెడ్డి, మండల కన్వీనర్ శేఖర్ రాజు, పట్నం ప్రభాకర్ రెడ్డి తదితరులు నవీనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ లక్ష్మీపతి, రాజగోపాల్ రెడ్డి, ధనగిరి రెడ్డి, పద్మనాభ రెడ్డి, ఇవి చందు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల వర్కర్స్ యూనియన్ ప్రారంభం

ప్రజాశక్తి-పాకాల: మండలంలో బహుజన ఆటో డ్రైవర్ల వర్కర్స్ యూనియన్‌ను అంబేద్కర్ భవన అధ్యక్షుడు ఆనందయ్య ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఐక్యంతో ఆటో డ్రైవర్ల, కార్మికుల సమస్యలు సాధించడానికి కషి చేయాలన్నారు. కార్యక్రమంలో బహుజన ఆటో వర్కర్ల యూనియన్ అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శేఖర్, ఆటో వర్కర్స్ యూనియన్ సభ్యులుగా మోహన్, రెడ్డప్ప, శేఖర్ , నాగరాజు, గోవర్ధన్, రెడ్డప్ప, ఆనంద, నూర్‌బాషా, దేవేంద్ర, ప్రసాద్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: పాలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని మండల పాల ఉత్పత్తిదారుల కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం మండల కేంద్రంలో నాపా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మండల పాల ఉత్పత్తిదారుల కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో పాల ఉత్పత్తిదారుల కమిటీ గొర్రెలు, మేకల పెంపకందారుల ఉమ్మడి చిత్తూరు జిల్లా డైరెక్టర్ చిన్ని రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వ్యవసాయం తర్వాత పాల ఉత్పత్తి అతి పెద్ద వ్యవస్థ అని.. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో మారుతున్న పరిస్థితులలో పాల ఉత్పత్తిదారులు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండలానికి చెందిన రైతులు తడ చెల్లయ్య, శ్రీను, చంద్రశేఖర్, సిద్దులయ్య శంకర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మమ్మకు నివాళులు

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండలంలోని ఆర్కేవీబీ పేట గ్రామంలో శివాల దామోదర్ రెడ్డి తల్లి శివాల లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం లక్ష్మమ్మ కర్మ క్రియలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీపీ లతబాలాజీ, మండల కన్వీనర్ శేఖర్ రాజు, వైసిపి సీనియర్ నాయకులు ఈవి మునస్వామి రాజు, మాజీ జడ్పీటీసీ దేవికి లోకనాథరెడ్డి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

మార్కొండయ్యకు...

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ఏనుగు దాడిలో శనివారం రాత్రి మృతి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు మార్కొండయ్య మృతికి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఆర్.విజయ భాస్కర్ రెడ్డి, ఎంపీపీ రెడ్డప్ప, మండల కన్వీనర్ బాగా రెడ్డి, వైస్ ఎంపీపీ జీడీ బాబు తదితరులు ఆదివారం ముదిరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లి మార్కొండయ్య మతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు వారు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. స్థానిక సర్పంచ్ చంద్రమోహన్, రవికుమార్, వైసీపీ నాయకులు లతీఫ్, రాయల పేట ఎంపీటీసీ సరస్వతి గురునాథ్ రెడ్డి, మాజీ ఎంపిటిసి కృష్ణారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, పరంధామ, తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-సత్యవేడు: శ్రీసిటీ పోలీస్ స్టేషన్ ఎస్సై ప్రవీణ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ నాయకులు డిమాండు చేశారు. రాచపాళెం గ్రామ దళితవాడకు చెందిన కుమార్‌ను అగ్రకులస్థులు, నాయకులు ఆరుగురు కలసి హత్యాయత్నం చేసి ప్రాణాపాయ స్థితిలో వదిలేసి వెళ్లిన సంఘటన జరిగిన నాలుగు రోజులు అనంతరం మృతిచెందాడు. నిందితుల్లో ఒకరు జరిగిన సంఘటన బయట పెట్టినా పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమని.. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి అరుణాచలం వాపోయారు. సమాజాన్ని కాపాడాల్సిన పోలీసు అధికారులు అధికార పార్టీ నాయకులు చేసే తాప్పులను కప్పి ఉంచడానికి ప్రయత్నం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి దళిత కుటుంబానికి న్యాయం చేయకుంటే జిల్లా వ్యాప్తంగా దళిత సంఘాలను ఐక్యం చేసి పోరాడుతామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు రమేష్‌తో కలిసి బాధిత కుటుంబ సభ్యులను కలిసి వివరాలు తెలుసుకొన్నారు. సోమవారం సత్యవేడు సీఐటీయూ ఆఫీస్‌లో ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

దళిత బహుజనుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-పాకాల: పాకాల అంబేద్కర్ భవన అభివృద్ధికి, దళిత బహుజనుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన అంబేద్కర్ భవన అధ్యక్షుడు గుండ్లపల్లి ఆంజనేయులు అన్నారు. అంబేద్కర్ భవన మాజీ అధ్యక్షులు ఆనందయ్య, భవన మాజీ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన భవన అధ్యక్షుడు గుండ్లపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకోసారి జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ రెండు సంవత్సరాల వరకు కొనసాగిస్తామని తెలిపారు. భవన అధ్యక్షుడుగా గుండ్లపల్లి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడుగా పి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా గణేష్, ఉప కార్యదర్శిగా గోపాలయ్య, కోశాధికారిగా శివప్రసాద్, ఆర్గనైజింగ్ సభ్యులుగా ప్రభాకర్, నరసింహులు, చిన్నబ్బలను ఎన్నుకున్నారు.

సేవాగుణం దేవుడిచ్చిన వరం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సేవాగుణం దేవుడిచ్చిన వరమని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 141వ నెల ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసులు మాట్లాడుతూ నేటి సమాజంలో కుటుంబ బంధుత్వ బాంధవ్యాలు నశించిపోతున్నాయని, ఎవరికి వారు స్వార్థపూరితంగా జీవిస్తున్నారని వాపోయారు. యాంత్రిక జీవనంలో కొట్టుకుపోతున్న తరుణంలో కొందరు సమాజం కోసం తాను బతుకుతూ తనతో పాటు మరో నలుగురు బతకాలన్న ఆలోచనతో ముందుకు వచ్చి సేవాభావంతో పదిమందికి సహాయం చేస్తుండటం అభినందనీయమన్నారు. మునీర్ బాషా, రమేష్ బాబు, న్యాయవాది రాజేశ్వరరావు, కంటా ఉదయ్ కుమార్, హరి నాయుడు, పుణ్యం ఢిల్లీ కుమార్ పాల్గొన్నారు.

ఆటో కార్మిక యూనియన్ మహాసభకు తరలిరండి

ప్రజాశక్తి-కోట: ప్రథమ మహాసభ ఆగస్టు 27న కాళహస్తిలో జరగనున్న కార్యక్రమానికి భారీగా తరలి రావాలని కోట సీఐటీయు మండల కార్యదర్శి ఎమ్.హరనాథ్, అధ్యక్షులు రమణయ్య తెలిపారు. ఆదివారం కోట బస్టాండ్ సమీపంలోని 'దాద రాయగుంట సెంటర్' లో ఆటో స్టాండ్‌లో కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు పనబాక రమణయ్య, కె.వి.రమణయ్య, సి.హెచ్. కష్ణయ్య, పనబాక కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.